# కవితా కౌముది

## ఈ టైం ఉందే..!

సముద్రాల హరికృష్ణ

నేడు మారిపోతోంది రేపుగ, నిన్న జారిపోతోంది మొన్నగ/
నీడకే అందని వేగంతో, ఈ కాల శకటపు పరుగులో!!

★★

దిగే వాళ్ళ ఎక్కే వాళ్ళ హడావిడే! దానికేమి పట్టదేమొ/
ఆ గమ్యమేమిటో,ఆ పయన మెచటికో,ఏమి తెలియదు!

★★

పిల్లలను పెద్దలుగ, పెద్దలను పిన్నలుగ మార్చే బండి! /
వల్లమాలిన ప్రేమలు,కల్ల కాపట్యా లేవి అంటని బండి!

★★

గెలుపు లోటముల,కిందు మీదుల సరకు చేయని బండి/
ఆలమంత మీదే,గోలలన్ని మీవె యనే, గుండె లేని బండీ!!

★★

రాబోయే మజిలీ ఒక గుర్తుకే, దాటేసినదీ జ్ఞాపకమే!
జ్ఞాపకాల కలిమికి నీదే పూచీ,బండి కేవల సాక్షియే!!

★★★★★

కొన్నాళ్ళు నీ గురించి,ఇంకొన్నేళ్ళు నీ వాళ్ళకై కడు ఆరాటం!/
ఎన్ని తీరినయ్యో ఏమొ గాని ముంగిట వాలు నా సంధ్యారాగం!

★★

ఎంత యత్నించినా,''ఫలం'' పరమపద మొక్కోసారి, అందక!/
అంతా ముగిసిందని తలుపేస్తే, గుమ్మంలో విజయ పతాక!

★★

వెదికేది దొరకక, దొలికేది మిగలక, నిన్నేమార్చే/
అద్భుత గారడీ,ఈ కాలం,అనుక్షణం మారుతూ, మారుస్తూనూ.

★★

ఏదేమైనా ఆగని దాని కకాల సుకాలా లేమిటసలు?/
అదరని పట్టు నీదైతే,సంకల్పమే స్థిరం,కృషే కర్తవ్యం!

★★

ఎంతకు చలించని దానికి, తన,పర, లేదన్ని ఒక్కటే!/
శాంతులైన,పూజలైన మనశ్శాంతికె,నీకు వీపు తట్టుటే

★★

దారిలో నలిగి, నీ ఆశలు దూదిలా గాలికి ఎగిరినా/
ఓరిమే ధనం,పోరాటమే బలం,కాలంలో యానమిక సుఖం!

★★

చుక్కల పొడిగింపు గీత, అంతు లేని కాల బృహద్గీతలో/
ఒక్క చుక్కలో చుక్కవు, నీకే, తెగ బారెడు ఆశ దేనికి?

★★

ఒక్కటి ఖచ్చితం, ''నా ''దంటే రానిది ''మన'' దంటే చిక్కుతుంది/
చిక్కని కాల రహస్యం,''స్వార్థం తరిగితే, పరమార్థమని''!!

★★★

# అక్షరమా

శ్రీధరరెడ్డి బిల్లా

నా మదిలోనే నీవు కదలాడుతున్నంతసేపు
అక్షరమా! ఏ ఆకారమూ లేని నీవొక ఆలోచనవి!

కలము చేబట్టి కాగితముపై నిన్ను మలిచి
తొలిరూప మిచ్చినపుడు తుళ్ళిపడితివి!

నీవు నచ్చకనో, నా రాతలే నచ్చకనో
చెత్తబుట్టలోకి చేరినపుడు చిన్నబోతివి!

మరొక రూపుగా అమరిన నీవు మరొక కాగితంపై
చేరినపుడు మనమిద్దరమూ మురిసిపోతిమి!

నన్ను వీడి నీవు వెళ్తున్నపుడు నాకు తెలుసు
ముందు,వెనక పదునున్న నీవిప్పుడు ఆయుధానివని!

విషాదంగా ఉన్నవాళ్లకు వినోదాన్ని పంచగలవు
ఆహ్లాదంగా కూచున్నవారిలో ఆగ్రహాన్ని వెలికితీయగలవు!

ప్రాణస్నేహితులకు నన్నొక పగవానిగా జేయగలవు
పరిచయమేలేని వాళ్లకు ప్రాణమిత్రునిగానూ జేయగలవు!

అజ్ఞానాంధకారము పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించగలవు,
జ్ఞానులమధ్యన చిచ్చుబెట్టి సమరశంఖం పూరించనూ గలవు !

ఎలుగెత్తి ఒకే రూపముతో నలువైపులా వెళ్లిన నీవు
నావైపు తిరిగివస్తున్నపుడు మాత్రం నానా రూపాలెత్తుతావు!

పలువురి అభినందనల పూలదండలు పట్టుకొస్తావు
కొందరి ఖండనలూ, కోపాల కొరడా దండనలూ నాపైన
ఝుళిపిస్తావు!

ముళ్లబాటనైనా, పూలబాటనైనా పయనం ఆపవద్దంటూ,
కలంపట్టిన కవికి ఏవైనా అలంకారాలేనని ప్రోత్సహిస్తావు !

వేల రాళ్ళదెబ్బలైనా, వేసే పూలమాలలైనా
నిన్ను మలచిన కవికే గాని నీకు కాదని నవ్వుకుంటావు!

కాలసుడిలో పడి కవి కాలధర్మం చెందినా,
కవితవై నిలిచి నిన్ను మలచిన కవిని గుర్తుచేస్తూనే ఉంటావు!

★★★

# ఖాళీగది

నందిరాజు విజయకుమార్

నిన్నటిదాకా-
చెట్టెడుపూలను కొమ్మలకొద్దీ కుమ్మరించి
పొద్దున్నే పొగడ పలకరింపుగా పరిమళించేది.
కిటికీరెక్కలను తెరుచుకొని మరీ
సన్నజాజి తీగలచేతుల్ని చాచి కరచాలనం చేసేది.
గుమ్మంభుజంపై వాలి
ఎన్నిపక్షులు రెక్కలార్చుకొని
మాటల్నికలబోసుకొనేవో!
ఎంతమంది మనుషులు సీతాకోకచిలుకలై
గదిలో ఇంద్రధనుస్సుల్లా వికసించేవారో.
ఎన్నిబంధాలు బీరతీగల్లాపాకుతూ
గాఢంగా ఆలింగనం చేసుకొనేవో!
అదేంటో హఠాత్తుగా
గది వైరస్ సోకిన దేహంలా ఉక్కిరిబిక్కిరౌతుంది.
దిగుల్ని ఒళ్ళంతా పోసుకొని
ఆత్మీయమైనమానవ స్పర్శ కోసం తపిస్తుంది
పసుపు వెలిసిపోయిన గడప
చూపుల్ని వీధిలోకి పరచి ఒంటరిగా నిలుచుంది.
అర్జెంటుగా మనిషితనం సిలెండర్లను తెప్పించండి
ఖాళీఐపోయిన గదిఊపిరితిత్తుల్ని
పూరాగా నింపండి
భూగ్రహంపై నిర్జనావశేషంగా పడున్నగదిలో
దట్టమైన అడవుల్ని మొలిపించండి.
వరి కంకులపతంగుల్ని ఎగరేసి
పిచ్చుకలకి ప్రేమసందేశం పంపండి
కాలంకార్చినకన్నీటిచుక్కలా ఉన్న గదిలో
కాంతిని పరావర్తనం చేయించండి
అరే!ఖాళీ గదిని పూరించండిపూలతో,పుప్పొళ్లతో!
దోసిళ్ళనిండా స్నేహాలతో,గుండెల చప్పుళ్లతో!!

★★★

## తొలిరేయి లేఖలా...
## చందలూరి నారాయణరావు

ఈ రాత్రే
దేహాక్షరంతో
జీవితానికి తొలిమాట వ్రాసేది.
కళ్ళ దారిలో
పెదవి వాకిలిన
వెచ్చని వాక్యం
మధురయాత్రకు ముస్తబౌతుంది.
తియ్యని దారులలో
సిగ్గుపడిన కొత్తదనాన్ని
చేతుల సంకెళ్లతో
కౌగిటి సెగల నడుమ
చూపుల ప్రేమాగారం స్వాగతం పలికింది.
వెన్నెల వానలో తడిసి
మల్లెల చాటున
ముడుచుకుపడుకొన్న కల
కళ్ళు తెరచి ఒళ్ళు విరచుకొన్నది.
నుదుట నడివీధిలో నిలపడి
దేహమంతా వినపడేలా
నిన్ను కవితగా కలవరించి,
ఎద అమృతం తాకిడికి
అందం పుట్టపగిలి
విరహపు కట్లు తెగాయి.
కల నిజమయ్యే వేళలో
ఒడిసిపట్టిన ప్రతి క్షణంలో
తృప్తి రేణువులు పెదవిపై ఎర్రగా
వేకువ దాకా నడిచిన మధురానుభూతికి
"నూరేళ్ల జీవితం" అంకితం.
విప్పారిన కళ్ళు పంచిన పరవశానికి
అధరకాగితంపై
ప్రేమ లేఖను చెక్కాను.
మరో జన్మలో సైతం గుర్తుకొచ్చేలా....
జవాబిచ్చేలా......

★★★

## స్వాతి చినుకు
## సిరిపురపు శ్రీనివాసు

గుర్రాల్లా పరిగెత్తిన కోరికలు
కాలం చెల్లి చిత్తరువులుగా మిగిలాయి ,
ఆశల పల్లకీ మోయలేక
బరువెక్కిన భుజాలు ఆసరా కోరుతున్నాయి ,
తమ కోర్కెల శిల్పాలను చెక్కుతూ
ఖర్చయి పోయిన జీవితమూ, కాలమూ
కొడిగడుతున్న దీపంలా రెపరెపలాడుతున్నాయి,
జీవిత కాలం చేసుకున్న మంచీ చెడుల తరాజు
ఫలితాలను బేరమాడుతోంది ,
జీవిత పోరాటంలో అలిసిన రెక్కలు
ఆసరాను కోరుతున్నాయి ,
బిడ్డల కాలికింద కంటకాలను తొలగిస్తూ
వారి అడుగుల దారిలో వెలుగులు పరుస్తూ
ప్రేమ చినుకు కోసం పలవరించిన
రెండు చకోర పక్షులు
ఆ కన్నపిలుపు స్వాతి చినుకుకై ఎదురుచూస్తున్నాయి!
ముదిమి వయసులో చేయూతకోసం కలవరిస్తున్నాయి!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

బాలభానుని వెచ్చని పాదములను
పుడమి పారవశ్యముననుప్పొంగిపోయె
ఇది మనోజ్ఞత నిండిన యుదయకాంతి
ఈ మహాదృశ్యమరయనింకేమి వలయు

ఎంత యందమైనది పృథివీతలమ్ము
ఇంత యరుదైన వరము నాకిచ్చెనెవరు
చేతికందినదద్భుతజీవితమ్ము
అందరకు పంచనీ మధురానుభవము

చేసితిని మంచి పనులెన్నొ జీవితమున
తలచినప్పుడు సంతృప్తి కలుగునెదను
చేయక మిగిలిపోయిన చేతలెన్నొ
కలుగజేయును మదిలోన కలవరమ్ము

మనసు విప్పి నుడువలేని మాటలెన్ని
పెల్లుబికి బయటకు రాని ప్రేమలెన్ని
కనికరమ్మునిండి చేయని పనులవెన్ని
తుడువలేనట్టి కన్నీటి కడలులెన్ని

కరుణతో ప్రేమతో మది కరిగినపుడు
మనసు చెప్పిన మాటలు వినగనగును
నేడు రేపంచు మదిని సందియము నిండ
మరలిపోయిన క్షణములు తిరిగి రావు

COMMENTS